క్లుప్తంగా

విద్యార్థులు పోటీతత్వంతో చదువుకోవాలి



బాపట్ల: విద్యార్థులు పోటీతత్వంతో చదువుకోవాలని ఎమ్మెల్యే కోన రఘుపతి సూచించారు. ప్రతిభావంతులైన బ్రాహ్మణ విద్యార్థులకు శ్రీభావపురి బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక ఏవీవీ హైస్కూలులో సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. పోటీతత్వంతో ముందుకుపోవాలని తెలిపారు. పదో తరగతిలో 586మార్కులు సాధించిన అభిరామ్ కార్తీక్, ఇంటర్‌లో 973మార్కులు సాధించిన మాదిరాజు లక్ష్మీప్రవల్లికకు ప్రోత్సాహకాలను అందించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షులు నిభానుపూడి శ్రీహరి ప్రకాష్, సమాఖ్య కార్యదర్శి సోమరాజు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కొలను మోహన్, కోశాధికారి పూసపాటి శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు, బ్రాహ్మణ కుటుంబీకులు తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి



కొల్లూరు : వ్యాధి నిరోధక టీకాలను చిన్నారులకు, గర్భిణులకు నిర్దేశించిన సమయాల్లో క్రమం తప్పకుండా అందించాలని కొల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డి.రవిబాబు పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ పరిధిలో సోమవారం టీకాలు వేయకుండా మిగిలిపోయిన ఐదేళ్లలోపు చిన్నారులు 28 మంది, గర్భిణులు ముగ్గురికి వెంటనే వైద్య, ఆరోగ్య సిబ్బంది టీకాలు వేసినట్లు తెలిపారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం



యడ్లపల్లి(వేమూరు): ముస్లిం పేద విద్యార్థులను ఆర్థికంగా ఆదుకోవడం జరుగుతుందని ఇమాం ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఖాశిం ఖాన్ పేర్కొన్నారు. చుండూరు మండలంలోని యడ్లపల్లి గ్రామంలో ఇమాంఖాన్ చారిటబుల్ ట్రస్ట్ 16వ వార్షికోత్సవం సందర్భంగా పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేయడం జరిగిందన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు నగదు బహుమతి అందించడం జరిగిందని తెలిపారు. ఇతర నోటు పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. సర్పంచ్ షేక్ ముంతాజీ బేగం, చుండూరు మండల పరిషత్ కో–ఆప్షన్ మెంబరు అబ్దుల్ ఖాశిం పాల్గొన్నారు.

ఘన జీవామృతంతో అధిక దిగుబడులు



వల్లభాపురం(కొల్లిపర): ఘనజీవామృతంతో వరి, ఇతర పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని స్టేట్ ప్రకృతి వ్యవసాయ సీనియర్ కన్సలెంట్ రామచంద్రం, రీజనల్ కోర్డినేటర్ వెంకటరావు అన్నారు. సోమవారం మండలంలోని వల్లభాపురం గ్రామంలోని ప్రకృతి వ్యవసాయంలో వరి సాగు చేస్తున్న దేశవాలి మైసూర్ మల్లిక రకం జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి రైతు ఎంతో కొంత ప్రకృతి వ్యవసాయం ద్వారా రకరకాల పంటలను పండించి ఆరోగ్య వంతమైన జీవితాన్ని జీవించాలని సూచించారు. ప్రతి రైతు ఖరీఫ్‌లో సాగు చేసే ముందు పొలంలో ఘనజీవామృతం వేయాలన్నారు. కార్యక్రమంలో డిపిఎం రాజకుమారి, ఏఓ వెంకటరావు, రైతులు కంభంపాటి కృష్ణ, దాసరి రత్న భాస్కర్, అవుతు పోతిరెడ్డి, కృష్ణ గురుమూర్తి, నాగ బసివిరెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

తెనాలిరూరల్: పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. తెనాలి మండలం సంగం జాగర్లమూడి గ్రామ పరిధిలో నిమ్మతోటల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఆదివారం అర్ధరాత్రి దాటాక ఆకస్మిక దాడులు నిర్వహించారు. కుక్కలను కాపలా పెట్టి కోత ముక్కాడుతున్నారు. పోలీసుల రాకను గుర్తించిన జూదరులు పరారవగా ఒక వ్యక్తి పోలీసులకు చిక్కాడు. అక్కడ ఒక సెల్‌ఫోన్, బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన జూదరుల ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లు ఎస్ఐ సోమవారం రాత్రి తెలిపారు.

ఘనంగా చేనేత దినోత్సవం



చేనేత నాయకులను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

రేపల్లె: నూలు పోగును వస్త్రంగా మలచి మనిషి మానాన్ని కాపాడే నేతన్నకు ఎప్పుడు రుణపడి ఉంటానని రేపల్లె చేనేత సహకార సంఘం అధ్యక్షుడు పట్టెం శ్రీనివాసరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇసుకపల్లి చేనేత సహకార సంఘ కార్యాలయంలో సోమవారం వేడుకలు నిర్వహించారు. మన అస్తిత్వానికి అసలైన గుర్తింపునిచ్చే చేనేత వస్త్రాలనే ధరించాలని కోరారు. దేశంలో నేత పరిశ్రమ వ్యవసాయం తరువాత పెద్ద పరిశ్రమ అయిన చేనేత కార్మికులు భారత స్వతంత్ర్య సంగ్రామంలో కీలక పాత్ర పోషించారన్నారు. 1905 ఆగస్ట్ 7న కలకత్తా నగరంలో విదేశీ వస్త్రబహిష్కరణ చేసి, జాతీయ ఉత్పత్తులనే వాడాలని పిలుపునిచ్చారన్నారు. 2008లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నేతన్నలను గుర్తించి చేనేత దినోత్సవాన్ని ప్రారంభించారన్నారు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతన్నలను ఆదుకునేందుకు మహత్తర కార్యక్రమం నేతన్న నేస్తం ద్వారా ఆర్థిక చేయూతనందిస్తున్నారన్నారు. అనంతరం చేనేత కార్మికులకు ఘనంగా సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో ఇసుకపల్లి చేనేత సహకార సంఘం అధ్యక్షుడు కొతరపు వెంకట సుబ్బారావు, కౌన్సిలర్ ఆకురాతి గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

నగరం: చేనేత పరిశ్రమను ఆదరించాలని ఎస్వీఆర్ఎం కళాశాల ప్రిన్సిపల్ అనగాని హరికృష్ణ చెప్పారు. స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో సోమవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ చేనేత వస్త్రాలను ధరించడం వల్ల చేనేత పరిశ్రమను అభివృద్ధి చేయవచ్చన్నారు. చేనేత కార్మికుల నైపుణ్యాలు, కష్టాలను విద్యార్థులకు వివరించారు. తొలుత విద్యార్థులకు చేనేత పరిశ్రమపై వక్తృత్వం, వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహి ంచారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ హరికృష్ణ

చే‘నేత’ ప్రగడ కోటయ్యకు ఘన నివాళి

చెరుకుపల్లి: నేతన్నలను ఆదుకున్న గొప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని సాయి రాజేంద్రా చేనేత సహకార సంఘ అధ్యక్షుడు మరివాడ సత్యన్నారాయణ పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సొసైటీలో చేనేత నాయకుడు స్వర్గీయ ప్రగడ కోటయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళర్పించారు. ఈ సందర్భంగా సత్యన్నారయణ మాట్లాడుతూ భారత దేశంలో వ్యవసాయ రంగం తరువాత రెండవ స్థానంలో చేనేత పరిశ్రమపై ఎక్కువ మంది ఆధారపడి ఉన్నారన్నారు, ఆరుంబాక, కనగాల, రాజవోలు చేనేత సహకార సంఘాల్లో కోటయ్య చిత్ర పటాలకు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. చేనేత సొసైటీ కేంద్రాల్లో చేనేత పెద్దలను సన్మానించుకున్నారు.ఈ కార్యక్రమంల్లో నాయకులు మరివాడ ప్రసాద్, లక్ష్మీనర్సు, సంగాబత్తిన సూర్యనారాయణ, కందుల వెంకటేశ్వరరావు, దివి శ్రీనివాసరావు, కందుల లీలాకుమారి, వంగరు సాయిబాబు, అందే సాంబశివరావు పాల్గొన్నారు.

చేనేత కార్మికులు సంఘటితంగా పోరాడాలి



జాతీయ చేనేత దినోత్సవ పతాకాన్ని ఆవిష్కరించిన జీడీసీసీ మేనేజర్ మల్లేశ్వరావు

భట్టిప్రోలు: చేనేత పరిశ్రమను రక్షించుకునేందుకు రాజకీయాలకు అతీతంగా చేనేత కార్మికులు సంఘటితంగా పోరుబాట సాగించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యులు గొట్టుముక్కల బాలాజీ పిలుపునిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని భట్టిప్రోలు రైలుపేట సొసైటీ ఆవరణలో జాతీయ చేనేత దినోత్సవ పతాకాన్ని జీడీసీసీ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ మల్లేశ్వరావు ఆవిష్కరించారు. బాలాజీ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమాన్ని మలుపు తిప్పడంలో చేనేత పరిశ్రమ కీలక పాత్ర వహించిందన్నారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు బట్టు సుబ్బారావు, బట్టు రామకృష్ణ, బి.శంకరరావు, జక్కా బాపయ్య, కొతరపు సారథి, ఎన్.జగన్మోహన్ రావు, కె.నాగమణి, కె.కోటేశ్వరావు, ఎ.శివరంజని, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

భట్టిప్రోలులో చేనేత కార్మికులు నిరసన దీక్ష

సంక్షోభంలో కూరుకుపోతున్న చేనేత పరిశ్రమను రక్షించుకునేందుకు కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని చేనేత కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భట్టిప్రోలు రథం సెంటర్‌లో చేనేత కార్మికులు నిరసన దీక్ష నిర్వహించారు. చేనేతకు 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని, నేతన్న నేస్తాన్ని షెడ్ కార్మికులు, చేనేత ఉప వృత్తుల వారికి అమలు చేయాలని కోరారు. సొసైటీలకు ప్రభుత్వం రాయితీ బకాయిలు చెల్లించాలని, వస్త్ర నిల్వలను కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘాల నాయకులు మురుగుడు సత్యన్నారాయణ, గొట్టుముక్కల బాలాజీ, బి.నాగమల్లేశ్వరావు, కె.రామకోటేశ్వరావు, ఎ.శ్రీనివాసరావు, కె.మోహనరావు పాల్గొన్నారు.

దమ్ము చక్రాల కింద రోడ్లు ధ్వంసం



రహదారిపై తిరుగుతున్న దమ్ము చక్రాల ట్రాక్టర్

భట్టిప్రోలు: ఏటా ఖరీఫ్ సీజన్‌లో దమ్ము చక్రాల ట్రాక్టర్లు తిరగడంతో రహదారుల ఛిద్రమవుతున్నాయి. సాధారణంగా దమ్ము చక్రాలకు ప్రత్యేకంగా బద్దెలను ఏర్పాటు చేసుకుని, పంట పొలాలలకు తీసుకెళ్లిన తర్వాత బద్దెలు తీసి వేస్తే ఈ సమస్య ఉండదు. ముఖ్యంగా దమ్ము చక్రాల ట్రాక్టర్లు తారురోడ్లపై తిరగడం వల్ల త్వరగా ధ్వంసమవుతున్నాయి. దీనికి తోడు వాటికి ఉండే బురద రహదారిపై పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారులపై దమ్ము చక్రాల ట్రాక్టర్లను తిప్పితే చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బీ, రెవెన్యూ శాఖలు ప్రకటనలు చేయడమే తప్ప.. ఆచరణ కానరావడం లేదు.

రేపల్లె పట్టణంలో 80శాతం ఓటర్ల సర్వే పూర్తి



మాట్లాడుతున్న తహసీల్దారు మల్లికార్జునరావు

రేపల్లె రూరల్: రేపల్లె పట్టణంలో ఓటర్ల సమగ్ర సవరణ సర్వేను 80శాతం పూర్తయినట్లు తహసీల్దారు డి.మల్లికార్జునరావు తెలిపారు. ఓటర్ల సర్వేపై పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పట్టణ, రూరల్‌లోని అధికారులు, బీఎల్వోలతో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల సర్వేలో ఎటువంటి సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్యను పరిశీలించి, పరిష్కరిచటం జరుగుతుందన్నారు. సర్వే మరో 20 శాతం పూర్తి కావాల్సి ఉందని, చివరి అంకాన్ని త్వరితగతిన పూర్తయ్యేలా బీఎల్వోలు పని చేయాలని ఆదేశించారు. సర్వేలో ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. ఓటు గుర్తింపు కార్డులోని వివరాలు తప్పులు ఉంటే మార్పులు, చేర్పులు చేయటం, మృతి చెందిన వారి ఓట్లను తొలగించటం, డబుల్ ఎంట్రీ ఓట్లను గుర్తించి ఓటర్లను చైతన్య పరిచి ఒక ప్రాంతంలోనే ఓటు ఉండేలా సరి చేయటం వంటి ప్రక్రియ సమగ్రంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి, ఎలక్షన్ డీటీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా గాయకుడు గద్దరు మృతికి నివాళి



అమర్తలూరు సెంటరులో గద్దర్ చిత్రపటానికి నివాళి

అమర్తలూరు(వేమూరు): ప్రజా గాయకుడు గద్దరు ఉద్యమాలకు మూల పురుషుడని ఎంపీపీ రాపర్ల నరేంద్ర అన్నారు. అమర్తలూరు మండల కేంద్రంలో సోమవారం గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మైనేని రత్న ప్రసాద్, మాజీ సర్పంచ్ కూచిపూడి సతీష్ కుమార్, కొండమూరి భాస్కర్, దేవరకొండ సుబ్బారావు, కొల్లిపర సుబ్బారావు, కట్టుపల్లి నాగరాజు, తులసీరామ్, బొడ్డు శ్రీనివాసరరావు, అమర్తలూరు వెంకయ్య, షేక్ కరీముల్లా, బన్నారావు, బాలకృష్ణ, ఇంటూరు విజయభాస్కర్ పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

రేపల్లె రూరల్: ప్రజా ఉద్యమ నేత గద్దర్ మృతి పట్ల పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం సెంటరులో వివిధ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం సంతా పసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ ప్రజల ఉద్యమ సమస్యలపై చేసిన పోరాటాలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సమాఖ్య నాయకులు దర్శి భాస్కరరావు, దారం సాంబశివరావు, కంచర్ల రవికుమార్, నాయకులు పట్టెం శ్రీనివాసరావు, డొక్కా శ్రీను, కంచర్ల రవికుమార్, దోమా రమేష్‌రాంజీ, నన్నేపాము రవి, చందు, సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ తదితరులు పాల్గొన్నారు.

కవచాలు అందజేత

తెనాలిటౌన్: పట్టణ షరాఫ్‌బజార్‌లోని శ్రీ సువర్చలా సమేత శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీ సీతారామచంద్రస్వామి విగ్రహాలకు కవచాలను పట్టణానికి చెందిన ముద్దుల రామమోహనరావు, విజయలక్ష్మి దంపతులు అందజేశారు. ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి వెండి కవచాలను స్వామివారికి అలంకరించారు. ఒక కిలో వంద గ్రాముల తూకంతో తయారు చేయించినట్లు దాత రామమోహనరావు తెలిపారు. ఆలయ ఈఓ అవుతు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మాజీ భర్తపై గృహ హింస కేసు నమోదు

వేమూరు: వివాహ బంధం కలిసిరాక.. మూడు పెళ్లిళ్ల అనంతరం మొదటి భర్త వద్దకు చేరిన భార్య అతనిపై సోమవారం గృహహింస కేసు పెట్టింది. స్థానిక ఎస్ఐ నాగరాజు వివరాల మేరకు.. మండలంలోని జంపని గ్రామానికి చెందిన శివకుమారి, రాజేష్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఇద్దరూ పదేళ్ల కాపురం చేశారు. ఈ క్రమంలో మనస్పర్థలు వచ్చి వారు విడాకులు తీసుకున్నారు. దీంతో శివకుమారి, శ్రీను అనే వ్యక్తిని రెండో పెళ్లి చేసుకుంది. అయితే రోడ్డు ప్రమాదంలో శ్రీను మృతి చెందడంతో.. శాంతి స్వరూప్ అనే వ్యక్తిని శివకుమారి మూడో పెళ్లి చేసుకుంది. అతను మరొక మహిళతో అక్రమ సంబంధం పెట్టుకొని ఆమెతో వెళ్లిపోయాడు. దీంతో శివకుమారికి దిక్కుతోచక మొదటి భర్త రాజేష్ వద్దకు చేరుకుంది. ఇద్దరం కాపురం చేసుకుందమని అతనితో రాజీ పడింది. ఇద్దరూ కాపురం చేసుకుంటున్నారు. అయితే తనపై అనుమానంతో హింసకు గురిచేస్తున్నాడని, రోజూ కొడుతున్నాడని వేమూరు పోలీసుస్టేషన్‌లో మొదటి, మాజీ భర్త రాజేష్‌పై శివకుమారి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు.. విచారించి గృహహింస చట్టం కింద రాజేష్‌పై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ నాగరాజు తెలిపారు.

బెస్ట్ లయన్స్ అవార్డు అందుకున్న కాకరపర్తి

తెనాలిఅర్బన్: బెస్ట్ లయన్స్ అవార్డును తెనాలికి చెందిన లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రమణ్యంకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మధరావు, జిల్లా గవర్నర్ కె.విజయ్‌చంద్‌లు అందజేశారు. గుంటూరులోని బిబిఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి ఈ కార్యక్రమం జరిగినట్లు సుబ్రమణ్యం తెలిపారు. ప్రతినిధులు సుభాష్‌బాబు, శివప్రసాద్ పాల్గొన్నారు.

‘మానవత’కు నిజాయితీనే ఆభరణం

తెనాలి: ప్రముఖ స్వచ్ఛంద సంస్థ మానవత తెనాలి శాఖ సభ్యత్వాన్ని పెంపుదల చేయాలని సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి సూచించారు. తెనాలి వచ్చిన సందర్భంగా సోమవారం స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో సంస్థ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. సంస్థ 98వ శాఖగా గత నెలలో మానవత తెనాలిలో ఆరంభమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వీలైనంత ఎక్కువ మంది సభ్యులు ఉండేలా చూడాలని చెప్పారు. సంస్థను నిజాయితీగా, నిబద్ధతతో నడపాలని చెబుతూ అందుకు అవసరమైన సూచనలు చేశారు. నిజాయితీనే సంస్థకు ఆభరణంగా చెప్పారు. తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్, కో–చైర్మన్ డాక్టర్ డి.శారద, ఘట్టమనేని నాగేశ్వరరావు, తీన్నరు శ్రీనివాసబాబు, కళ్యాణి, మొవ్వా సత్యనారాయణ, సీహెచ్ సాంబశివరావు, వేదాంతం ఫణీంద్ర, యు.సత్యనారాయణ, ఓంకార్ ప్రసాద్, పి.వెంకటేశ్వరరావు, ఎస్‌వీఎస్ఎస్ శర్మ, బి.రాజీవ్, పావులూరు రమేష్, రామాంజనేయరెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో మట్టి పరీక్షలకు శ్రీకారం

తెనాలిటౌన్: రైతులకు విజ్ఞానం పెంపొందించేందుకు వ్యవసాయ క్షేత్రంలోని మట్టి నమూనాలను సేకరించి, కేంద్రీయ విద్యాలయలో పరిశీలించి వచ్చిన ఫలితాలను రైతులకు తెలియజేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ వి.విజయలక్ష్మి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించబోయే పాఠశాల ద్వారా మట్టి పరీక్ష కార్యక్రమాన్ని సోమవారం జగ్గడిగుంటపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో శ్రీకారం చుట్టారు. వ్యవసాయశాఖ, ఆత్మ విభాగం ద్వారా పైలట్ విధానంలో దేశంలో 10 రాష్ట్రాల్లో చేపడుతున్నట్లు విజయలక్ష్మి చెప్పారు. ఎనిమిది నుంచి ఇంటర్ వరకు కొద్ది మంది విద్యార్థులను ఎంపిక చేసి గ్రామాల్లోని పొలాల్లో మట్టిని సేకరించి కేంద్రీయ విద్యాలయలో మట్టి పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులతో కలిసి శాంపిల్స్‌గా కొన్ని నమూనాలను అధికారులు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రామాంజనేయులు, ఆత్మ డీడీఏ డాక్టర్ రత్నమంజుల, తెనాలి ఏడీఏ ఎన్.ఉషారాణి, ఏఓ జి.ప్రేమసాగర్, ఎస్‌టిఎల్ ఏఓలు సత్యనారాయణ, ఝాన్సీవాణిరెడ్డి, విద్యాలయ ఉపాధ్యాయులు వేణుగోపాలరావు, రాజేంద్ర ప్రసాద్, లాంఫామ్ శాస్త్రవేత్తలు డాక్టర్ గంగాదేవి, డాక్టర్ పద్మజ, విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ శ్రీకాంత్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

మోగిన వార్డు ఎన్నికల నగారా

రేపల్లె రూరల్: రేపల్లె మండలంలోని పలు పంచాయతీల్లో పలు కారణాలతో ఖాళీ అయిన వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో శివపార్వతి తెలిపారు.

స్థానిక కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడారు. మండలంలోని బేతపూడి పంచాయతీ 7వ వార్డు, రాజుకాల్వ 5వ వార్డు, చాత్రగడ్డ 3, 8 వార్డులకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు.

కోనేటిపురం1, 5 వార్డులకు..

భట్టిప్రోలు: కోనేటిపురం గ్రామ పంచాయతీ పరిధిలోని 1, 5వ వార్డుల సభ్యులు మృతి చెందడంతో ఏర్పడిన ఖాళీల భర్తీకి.. ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాంబొట్లపాలెం, తుమ్మలపాలెంలో..

చెరుకుపల్లి: మండలంలోని రాంబొట్లపాలెం పంచాయతీలో 1, 10 వార్డులు, తుమ్మలపాలెం పంచాయతీలోని 6వ వార్డుకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.శ్రీనివాసరావు తెలిపారు.

ఎన్నికల నిర్వహణ ఇలా..

ఆయా వార్డులకు సంబంధించి ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 11న నామినేషన్‌ల పరిశీలన, 13న ఉప సంహరణ ఉంటుంది. 14న బరిలో ఉన్న అభ్యర్థుల పేర్లను ప్రకటించటం జరుగుతుంది. 19 ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు నిర్వమించి, 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతారు. అనంతరం గెలిచిన అభ్యర్థులను ప్రకటిస్తారు. పోటీచేసేందుకు ఆసక్తి అభ్యర్థులు పూర్తి వివరాలకు ఎంపీడీఓ కార్యాలయంలో లేదా పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాల్సి ఉంటుంది.

గడప గడపలో అపూర్వ ఆదరణ

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- పోతుమర్రు గ్రామంలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’



మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

పోతుమర్రు(వేమూరు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరడంతో గడప గడపకు వెళ్లిన తమకు అపూర్వ ఆదరణ లభిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరగ నాగార్జున అన్నారు. పోతుమర్రు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామ సమస్యలను గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా పరిష్కరిస్తున్నట్లు మంత్రి తెలిపారు.గత టీడీపీ ప్రభుత్వం చేసిన అప్పులకు..చేసిన అభివృద్ధికి పొంతన లేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అవినీతికి తావులేకుండా ప్రతి సంక్షేమ పథకం ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ అవుతోందని తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలిచి 2024 మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చందోలు డేవిడ్ విజయకుమార్, గ్రామ సర్పంచ్ కూచిపూడి మైనా, ఎంపీపీ యల్లమాటి మోహన్, ఎంపీటీసీ ఈపూరు కుసుమకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు బొల్లిముంత ఏడుకొండలు, గాజుల భానుప్రకాశ్, దున్నా మేరీసుబాబు, చందోలు బాబురావు, ఈపూరు బాబురావు, కూచిపూడి బెన్నుబాబు, ఈపూరు బోజేష్, కట్లెవరుపు రత్తయ్య, తెనాలి జక్రయ్య, కూచిపూడి మోజేష్, అత్తోట బాబురావు ఉప అధ్యక్షుడు షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

‘స్పందన’కు మూడు అర్జీలు

రేపల్లె: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్పందన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవానలి ఆర్డీవో జగన్నాథం పార్థసారథి అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. మున్సిపాలిటీకి సంబంధించి 2, హౌసింగ్‌కు సంబంధించి 1 చొప్పున అర్జీలు అందాయన్నారు. సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు.

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు



కొల్లూరులో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సుబ్బారావు

కొల్లూరు : తల్లిపాలతో చిన్నారుల్లో రోగనిరోధక శక్తి అధికగంగా ఉంటుందని కొల్లూరు జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు అన్నారు. సోమవారం కొల్లూరు ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, పెద్దలకు ఆరోగ్యంపై అవగాహనా కల్పించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలను బిడ్డకు తాగించడంతో పాటు, ప్రతి రోజు పాలివ్వడం వల్ల చిన్నారులు అనారోగ్యాలకు గురికాకుండా ఉంటారన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించడం చాలా అవసరమని స్పష్టం చేశారు. వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దోనేపూడి (కొల్లూరు): తల్లిపాల వల్ల చిన్నారుల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఐసీడీఎస్ దోనేపూడి సెక్టార్ సూపర్‌వైజర్ నాగరాజకుమారి అన్నారు. సోమవారం దోనేపూడిలోని మగ్గాల పాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ముగింపు సందర్భంగా అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద ప్రదర్శన నిర్వహించారు.

కానిస్టేబుల్‌కు మెరుగైన వైద్యసేవలు

జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్



కానిస్టేబుల్ రమేష్‌బాబు తండ్రితో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

నగరంపాలెం: గాయపడిన కానిస్టేబుల్ రమేష్ బాబు ఆరోగ్య పరిస్థితిపై గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆరా తీశారు. అనంతరం కానిస్టేబుల్ తండ్రి బసవయ్యతో మాట్లాడారు. తెనాలి వైకుంఠపురం దేవస్థానం ప్రాంగణంలో శనివారం దుండగులను పట్టుకునే ప్రయత్నంలో అత్యంత ధైర్యసాహసాల్ని ప్రదర్శించి, ఈ క్రమంలో గాయాలై గుంటూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో తెనాలి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ వై.రమేష్ బాబు చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. సోమవారం గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ ఆసుపత్రికి చేరుకుని, కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యుల్ని అడిగి తెలుసుకున్నారు. బాధితునికి మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు.

చోరీ యత్నం కేసులో నిందితుల అరెస్ట్

తెనాలిరూరల్: ఆలయంలో చోరీకి యత్నించడమే కాకుండ అడ్డుకునేందుకు వచ్చిన పోలీసుల్లో ఓ కానిస్టేబుల్‌ను తీవ్రంగా గాయపర్చిన కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. తెనాలి వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని కేశ ఖండనశాలలోని ఓ బాక్సులో భద్రపరచిన తలనీలాలను అపహరించేందుకు ముగ్గురు దుండగులు నవీన్, సాయికుమార్, జీవనతేజ 4వ తేదీ అర్ధరాత్రి ఆలయప్రాంగణంలోకి ప్రవేశించడం, కేశఖండనశాలకు పైకప్పులో ఉన్న రేకులను తొలగించి తాడు సహాయంతో లోనికి దిగగా అక్కడ శబ్దాలు వస్తుండడం గమనించిన ఆలయ వాచ్‌మాన్ డయల్ 100కు ఫోన్ చేసి సమాచారమిచ్చిన సంగతి తెలిసిందే.

ఘటనాస్థలానికి వెళ్లిన పోలీసు బృందంలోని కానిస్టేబుల్ వై. రమేష్‌బాబును తోసివేయడంతో అతను రేకుల షెడ్డు మీద నుంచి పడి తీవ్రంగా గాయపడిన సంగతి విదితమే. ఈ కేసులో నిందితులు ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్టు వన్‌టౌన్ సీఐ ఎ. చంద్రశేఖర్ సోమవారం రాత్రి తెలిపారు.